# డాన్స్... డాన్స్!

మా ఊరి నుంచి హైదరాబాద్ వెళ్లి సినిమాల్లో డాన్స్ చేస్తూ అతిత్వరలోనే పాపులర్ అయిపోయిన, అంటే... ఎన్టీయార్ తెలుగుదేశం పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లో ముఖ్యమంత్రి అయిపోయినంత మ్యాజికల్‌గా డాన్స్ డైరెక్టర్ అయిపోయిన నా చిన్ననాటి మిత్రుడు- నూతన సంవత్సర శుభాకాంక్షలు పంపిస్తూ, ఎప్పుడైనా హైదరాబాద్ వస్తే తన ఇంటికి రమ్మని వ్రాశాడు.

అంత పాపులర్ డాన్స్ డైరెక్టర్ తన ఇంటికి రమ్మని ఆహ్వానించడంతో కలలో ఒక్కసారి ప్రధానమంత్రి సీట్లో కూర్చున్నంత ఆనందం కలిగింది. ఎందుకంటే... సమాజంలో ఆర్థిక స్తోమత పెరిగిపోతే మానవ సంబంధాలు దెబ్బతింటాయి.

ఏదో ఆఫీసు పనిమీద హైదరాబాదు వెళ్లి- ఆటోలో మా పుల్లకూర కామేశ్వరరావు ఇంటికి బయలుదేరాను. చాలా దూరం- 'ఆటోకి ఎంతవుతుందో...'నని జేబు భయపెడు తున్నా సరే- 'తిరుగుప్రయాణం మారుతీ కారులో వుండకపోతుందా...' అనే ఆశతో జూబ్లీహిల్స్‌లో అడ్రసు దగ్గర ఆటో ఆపాను.

పోష్‌బంగ్లా బయట నాలుగు మారుతి 1000 సిసి కార్లు, రెండు అంబాసిడర్స్, ఒక సియోలో, చాలా స్కూటర్లు, సన్నీలు వున్నాయి. గేటు దగ్గర గూర్ఖా. 'మూవీ డాన్స్ స్కూల్' అని పెద్దబోర్డు వుంది. 'డైరెక్టర్ ఆర్.కె.కె. పుల్ల' అని వుంది.

అయితే వీడు డ్యాన్స్ స్కూలు వోపెన్ చేసేశాడన్నమాట! అవును... సినిమాల్లో డాన్స్ డైరెక్షన్‌తో తృప్తిపడితే ఎలాగూ అవకాశం వచ్చినప్పుడు నాలుగేసి మెట్లు ఎక్కి అగ్రస్థానానికి వెళ్లాలి. అందునా సినీఫీల్డ్‌లో పిచ్చ కాంపిటేషన్! ఒకవైపు ప్రభుదేవా, మరోవైపు తార, ఇంకా ఎందరో!

గూర్ఖా గేటు దగ్గర ఆపాడు... "ఠైరో... కౌన్ హై తుమ్?" అంటూ.

వెధవ- మంచీ, మర్యాద లేదు. 'నేను పుల్లగాడి బాల్యస్నేహితుణ్ణి! వాడూ, నేనూ 'ఏరా, ఏరా!' అనుకుంటాం' అని చెప్తే గుండాగి ఛస్తాడు. అయినా వీడిది తప్పు కాదు. మనం ఆటోలో వచ్చాం. అదే కారులో వస్తే సెల్యూట్ చేసి మరీ లోపలకు తీసుకువెళ్లేవాడు.

"పుల్లా మేరే బచపన్‌కి దోస్త్!"

"పుల్ల కౌన్..?"

"యే ఘర్ కా మాలిక్ హై!"

"క్యా బోల్తే యే ఘర్ హై తుమ్‌కో? యే భవన్ హై... ఇంద్రభవన్ హై!"

వీడి సిగదరగ... ఏదో ఒకటి! అసలే హిందీ కూడబలుక్కుని మాట్లాడలేక ఛస్తున్నాను.

"తుమ్ ఠీక్ బోల్‌దియ్యా! పుల్లకూర కామేశ్వరరావుగారు మేరా దోస్త్ హై... మై ఉన్ సే మిల్నా అయా హు!" అని బోలాను.

"అచ్ఛా హై సాబ్... అయిసా బోలో! సాబ్ డాన్స్‌క్లాస్ మే హై! ఆప్ బాహర్ వెయిటింగ్ రూమ్ మే బైఠీయే!" అన్నాడు. 'బ్రతికానురా దేముడా...' అనుకుంటూ గూర్ఖాగాడి ఇంటర్వ్యూలో గెలిచి లోపలకు ప్రవేశించాను.

వెయిటింగ్ రూమ్‌లో అడుగుపెట్టగానే ఒక వయ్యారిభామ దగ్గరికి వచ్చింది. మోకాళ్ల వరకూ ఎఱ్ఱని స్కర్ట్, పైన వంటికి అతుక్కుపోయిన పసుపు బనీన్. అపైన మెరిసే కోట్. సినీతారలా వుంది. రావడంతోనే-

"డాన్స్ మీకా, మీ పిల్లలకా? ఏ రకం డాన్స్..?"

"కాదమ్మా..."

"మొదట పదిహేను రోజులు 'అసలు డ్యాన్స్‌కి పనికివస్తారా, లేదా?' అని టెస్ట్ చేస్తాం. తరువాత పదిహేను రోజులు ప్రొబేషన్. మూడు నెలలు డాన్స్ నేర్పుతాం. ఆ తరువాత నెలకి ఒక సినిమాలో డాన్స్‌గ్రూప్‌లో పంపిస్తాం. సినిమావాళ్ళిచ్చే దాంట్లో ఫిఫ్టీ పర్సెంట్ స్కూల్‌కి డొనేట్ చెయ్యాలి కొంతకాలం. మొత్తం ఫీజు పదివేలు. అడ్వాన్సు కట్టండి. పుల్లగారితో ఇంటర్వ్యూ రాస్తాను. ఇంకో నాలుగు గంటలకు గాని మీకు అవకాశం రాకపోవచ్చును..." చెప్పుకుపోతోంది.

"అమ్మా తల్లీ! నేను 'పుల్ల'గారి బాల్యస్నేహితుణ్ణి వారి స్వంత ఊరి నుండి వచ్చాను."

"నేను మీకు అమ్మలాగా కనుపిస్తున్నానా? మేనర్స్ తెలియదు విలేజర్స్‌కి!"

"అమ్మా... మాది కాకినాడ!"

"ఎగైన్ అమ్మా... కాల్ మి మిస్!" అంటూ తన స్కర్ట్, వగైరాలు సవరించుకుంది.

"మిస్... నేను 'పుల్ల'గార్ని కలవాలి. అయామ్ హిజ్ క్లాస్‌మేట్. ప్లీజ్... అరేంజ్ ఇంటర్వ్యూ విత్ హిమ్!" అన్నాను.

నన్ను ఓ పురుగుని చూసినట్టు చూసి "నో బిజినెస్... వేస్ట్ ఆఫ్ టైమ్!" అని కసురుకుని-

"లెటజ్ సీ..." అంటూ తిప్పుకుంటూ వెయిటింగ్ రూమ్‌లో వున్న జనం దగ్గరకు వెళ్తోంది. కేబుల్ టీ.వీ. చూడ్డం మానేసి జనం ఈ అమ్మాయి డాన్స్ లాంటి నడక, అందం చూడసాగారు.

'అయితే... ఈ అమ్మడు నాకు 'పుల్ల'గాడితో ఇంటర్వ్యూ సంగతి చెప్పదా? ఎలా వాడ్ని కలవడం?' అనుకుంటున్నాను.

ఈలోగా-

నీలం జీన్స్‌ప్యాంట్, పైన పువ్వుల టైట్‌బనీను, అపైన మెరిసే షాల్ ధరించిన మనిషి హాల్‌లో ప్రవేశించాడు. మైఖేల్ జాక్సన్ టైపులో కళ్ళజోడు, మేకప్ విపరీతంగా వుంది.

అతను నన్ను చూసి "వొరేయ్‌ఁ... ఎంతసేపయింది వచ్చి?!" అన్నాడు.

'అమ్మయ్య.. వీడే 'పుల్ల'గాడు అన్నమాట!'

మిస్ మమ్మల్ని చూసి లోపలకు పరుగెత్తింది.

"మీ మిస్ నన్ను ప్రశ్నలతో చితక్కొట్టేసిందిరా బాబూ! ఈరోజు నీతో కలవడం అసాధ్యం అందిరా! భలేదాన్ని పెట్టేవురా... ఇది మీ అమ్మానాన్న నీకోసం వచ్చినా లోపలకు రానివ్వదు. 'నో బిజినెస్... టైమ్ వేస్ట్' అంటుంది!" అన్నాను.

దానికి వాడు పకపక నవ్వుతూ... "అదా? అలా వుండకపోతే అడ్డమైనవాడూ మన ప్రాంతం నుండి రావడం, వచ్చి నన్ను పీక్కుతింటున్నారురా బాబూ! అందుకే అలా కంట్రోల్! బైదిబై... మన ఊళ్లో అందరూ- ముఖ్యంగా మన మిత్రబృందం ఎలా వున్నారు?"అన్నాడు.

వీడు మమ్మల్ని మర్చిపోలేదు.

"అవునూ... నువ్వు ఉత్తరంలో డాన్స్ స్కూలు గురించి రాయలేదు?"

"ఎలాగూ వచ్చినప్పుడు చూస్తావు కదా... అని రాయలేదు. డైరెక్షన్‌తో పాటుగా డాన్సర్స్‌ని కూడా తయారుచేశాననుకో! అందులో నాకు లాభం వుంది!" అంటూ చిటికేశాడు. మిస్ దగ్గరకు వచ్చి పుల్లగాడి నోట్లో సిగార్ పెట్టి వెలిగించింది. "వెల్..." అంటూ దాని బుగ్గ మీద చిటికేశాడు.

"థాంక్యూ సర్!" అంది వయ్యారంగా.

"నీకేం లాభం డ్యాన్సర్లు తయారయితే..?"

"సినిమాల్లో ఒక్కో డాన్స్‌కి ఎంతమంది వుండాలనేది నేనే నిర్ణయిస్తాను. అంతమందిని డాన్సర్స్ సప్లయర్ పంపిస్తాడు. అతను ఎంతమందిని సప్లయ్ చేస్తే... వాళ్ళ అందరి దగ్గర అంత కమీషన్ కొట్టేస్తాడు. అదే... డాన్సర్స్ మన దగ్గరే ఉన్నారనుకో- ఆ కమీషన్ అంతా మనదే కదా!"

"బావుందిరా! మన కాకినాడ వాడివి... ఇంతటి తెలివితేటలతో అతితక్కువ కాలంలో మాయాసినిమా రంగంలో ఉన్నత స్థితిలోకి రావడం మాకు చాలా గర్వంగా వుంది."

"సర్లే... లోపలికి వెళ్దాం! నా డాన్స్ క్లాస్‌రూమ్ చూసేసి, అలా లంచ్‌కి వెళ్దాం. మధ్యాహ్నం డాన్స్ కంపోజింగ్ వుంది. నో ఇంటర్వ్యూస్ అప్ టు ఫైవ్ పి.ఎమ్.!" అంటూ లోపలకు తీసుకువెళ్లాడు.

అది ఒక పెద్ద హాలు- ఒక గ్లాస్ జార్‌లో... బొద్దింకలు- మరో గ్లాస్ బాక్స్‌లో బల్లులు- సజీవంగా కదులుతున్నాయి.

ఒక ప్రక్కన- వెయిట్ లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేసేవాళ్ళు ఎత్తే వెయిట్స్ వున్నాయి. మరో ప్రక్కన ఫుట్‌బాల్స్ వున్నాయి. ఒక హ్యాంగర్‌కి జీడిపాకం లాంటి పదార్థం వేలాడుతోంది. మరో హ్యాంగర్‌కి తుపాకులు, బ్యాట్‌మెంటెన్ బ్యాట్స్, క్రికెట్ బ్యాట్స్ వున్నాయి.

ఇవన్నీ చూసి- "ఇదేంటిరా బాబూ... నీ స్కూలు ఇలా వుంది?" అన్నాను.

చిటికేశాడు... మిస్ వచ్చింది. ఆ తర్వాత "నువ్వు ఆ కుర్చీలో కూర్చోరా!" అన్నాడు.

ఆమెను నిలబెట్టి, ఆమె ఎదురుగా తాడుకు కట్టిన బల్లిని ఆడించడం మొదలుపెట్టాడు. ఆమె భయంతో వెనక్కు ప్రక్కకూ భయంగా, చిరాకుగా ఫీలింగ్ పెడుతూ విచిత్రంగా ఫోజులు పెడుతోంది.

నాకు నవ్వు ఆగలేదు.

"నువ్వు ఇలాంటి డాన్స్‌లు సినిమాల్లో చూసేవుంటావు!"- అని, మళ్లీ చెప్పసాగాడు...

"ఇదొక ఫోబియా! రకరకాల డాన్సర్స్‌లో వున్న ఫోబియాను నేను ఎన్‌కాష్ చేసుకుని, వాళ్ళ దగ్గర్నుండి ఇలాంటి ఫీలింగ్స్ రాబట్టి డాన్స్ క్రియేట్ చేస్తాను. వెయిట్ లిఫ్టింగ్ ఆర్టికల్స్ కొన్నాళ్లు ఎత్తిస్తాను, దింపిస్తాను. తరువాత ఎత్తినట్లు, దింపినట్లు నటించమంటాను. అలాగే ఫుట్‌బాల్స్ తన్నినట్లు, ఆడుతున్నట్లు! అక్కడ జీడిపాకం లాంటిది వుంది చూశావా... దాన్ని ఒక పది వాల్ హ్యాంగర్స్‌కి తగిలించి ముందుకీ, వెనక్కీ లాగిస్తాను కొన్నాళ్లు! తరువాత అది లాగినట్లు నటింపచేస్తాను.

అలాగే క్రికెట్ ఆడినట్లు, బాట్‌మెంటెన్ ఆడినట్లు, తేలు కరిస్తే- విషం ఎక్కుతుంటే- మనిషి ఎలా బిహేవ్ చేస్తాడు? అలాగే తుపాకీతో పేలుస్తున్నట్లు, పిచ్చెక్కితే ఎలా బిహేవ్ చేస్తాడు- అలాగే ఎదురెదురుగా నిలబెట్టి ముందుగా మగాళ్ళను, ఆడాళ్ళను విడివిడిగా గుద్దుకోమంటాను. తరువాత ఇద్దర్నీ కలిపి ప్రాక్టీస్ చేయిస్తాను.

అలాగే జుట్టు పీక్కోడం, పైటలు లాగి విసిరెయ్యడం, మగాళ్ళు చొక్కాలు విప్పెయ్యడం, మళ్లీ తీసుకోవడం, ముక్కు పీక్కోడం, చెవులు పీక్కోడం, కాళ్లూచేతులు విదిలించుకోడం.., వొంగడం, గుంజీలు తీయడం, బోర్లా పడుకోడం, గిరగిరా తిరగడం, ఎగరడం, ఎత్తు నుండి దూకినట్లు నటించడం.

ఇంత ఎందుకు- ఎన్నో ఫీలింగ్స్ నటింపచేస్తాను. పైన చెప్పినవన్నీ ప్రాక్టీస్ అయ్యాక, కొన్ని ఐటమ్స్ సెలెక్ట్ చేసి, ఒక డాన్స్ కంపోజ్ చేస్తానన్నమాట! నేను కంపోజ్ చేసిన చాలా డాన్స్‌లు పాపులర్ అయ్యాయి."

"అవన్నీ ఏ సినిమాలో వచ్చాయిరా..?"

"ఒక పెళ్ళాం- ముగ్గురు మొగుళ్ళు!', 'మొగుణ్ణి అద్దెకిచ్చిన పతివ్రత', 'అప్పుడే అయిపోయిందా?', 'అత్త పడకింట్లో- ఆవిడ వంటింట్లో!', 'పిచ్చిది- పిచ్చోడు', 'వగలాడి భార్య- వంగునే భర్త'... ఇలా ఎన్నో సినిమాలు!"

"అవును. ఈ మధ్యన ఈ సినిమాలన్నీ చాలా పాపులర్ అయ్యాయి అనుకుంటాను."

"పద... కృష్ణా ఓబరాయ్ హోటల్‌కి వెళ్లి భోజనం చేసి వచ్చేద్దాం! మధ్యాహ్నం ఒక డాన్స్ కంపోజింగ్ వుంది... నీకు చూపిస్తాను!" అన్నాడు.

ఎంతలో ఎంత మార్పు?! క్లాసులో మా అందరికన్నా వెనకబడి అస్తమానూ మాస్టారు 'వెధవా... నువ్వు ఎందుకూ పనికిరావు!' అని తిట్టేవారు వీణ్ణి! ఎప్పుడైనా యానివర్సరీకి వీడు డాన్స్ చేస్తే 'పిచ్చి వెధవ' అని తిట్టేవారు. ఏదిఏమైనా కాలం తెచ్చే మార్పులతో మనిషి మారిపోవాలి... తప్పదు. సినిమాల్లో మనం 'పిచ్చి డాన్సులు' అనుకునే డాన్సులు నేర్పి, మావాడు లక్షలు సంపాదించాడు, సంపాదిస్తున్నాడు. పిచ్చిజనం ఎవరు? మనం కూడా సినిమాల్లో డాన్సులు చూసి, హాల్లోనే ఎగిరి గంతులు వేసే ఈ రోజుల్లో... మా 'పుల్ల'గాడి లాంటోళ్ళు పైకిరావడంలో ఆశ్చర్యం లేదు... ఆనందం వుంది.

ఇద్దరం బయటకు వస్తుంటే... వెయిటింగ్ రూమ్‌లో అందరూ లేచి నిలబడ్డారు. సేవకులందరూ వొంగి వొంగి దణ్ణాలు పెడుతున్నారు. వాడి సిరిసంపదలకు నా మనసు ఉప్పొంగింది. బయట ఆగివున్న సియోలో కారు ఎక్కాం.

కృష్ణా ఓబరాయ్ హోటల్‌లో భోజనం... అక్కడ కూడా మావాడికి రాచమర్యాదలే!

మావాడి గెస్ట్ బెడ్‌రూమ్‌లో పడుకున్నానో, లేదో... నిద్ర పట్టేసింది.

"ముసలాయనా... నిద్ర లే! 'పుల్లా'గారు పిలుస్తున్నారు!" మిస్ నన్ను పిలుస్తోంది.

"ఏం... నీకు ముసలాడిలా కనుపిస్తున్నానా?"

"ప్రొద్దున్న నన్ను 'అమ్మా, తల్లీ' అన్నారుగా!" అంటూ తిప్పుకుంటూ, డ్యాన్స్ చేసుకుంటూ వెళ్లిపోయింది. బదులు తీసుకుందన్నమాట... గడుసరే!

నేను డాన్స్ హాల్‌లోకి అడుగు పెట్టాను.

అక్కడ- ఇరవైమంది మగాళ్ళు, ఇరవైమంది ఆడాళ్ళు చాలా తక్కువ బట్టల్తో వున్నారు. నన్ను చూసి "అక్కడ కూర్చోరా! ఈ డాన్స్ కంపోజింగ్ చూడు... నీకే తెలుస్తుంది- సినిమాల్లో డాన్సు ఎలా వుంటుందో?!" అన్నాడు.

మిస్ వచ్చి, నా నోట్లో సిగార్ పెట్టి వెలిగించింది.

"యూ సిల్లీ!" అని బుగ్గ గిల్లాను. చురుగ్గా చూసింది నన్ను.

'పుల్లా'గాడు డ్యాన్స్ క్లాసు మొదలుపెట్టాడు-

"అమ్మాయిలూ, అబ్బాయిలూ! నేను చెప్పిన ఐటమ్స్ వరుసగా నేను చెప్పిన వెంటనే నటించండి. అందరూ ఒకేసారి చెయ్యాలి. ఓక్కే!" అని వాళ్ళకు చెప్పి-

"బరువులు పైకెత్తండి..!" అన్నాడు.

అందరూ అతికష్టం మీద బరువులు ఎత్తుకున్నట్లు నటించారు.

"దించండి..."

చాలా కష్టంగా దించినట్లు నటించారు.

"బంతులు తన్నండి..."

అందరూ చెల్లాచెదరైన ఫుట్‌బాల్స్ తన్నుకుంటున్నట్లుగా నటించారు.

"గొంగళి మీద పడింది..."

ఆడాళ్ళందరూ చిరాకుగా, భయంగా నటిస్తున్నారు. మగాళ్ళు వాళ్ళని చూసి నవ్వుతున్నట్లుగా అభినయిస్తున్నారు.

"మీ అందరికీ పిచ్చెక్కింది..."

అందరూ కలిసి ఒకరినొకరు పీక్కోడం, గిల్లుకోవడం... పిచ్చిపిచ్చిగా నటిస్తున్నారు.

"చెవులు పీక్కోండి..."

ఎవరి చెవులు వాళ్ళు, ఒకరి చెవులు మరొకరు పీక్కున్నారు.

"జుట్టు పీక్కోండి..!" - జుట్లు పీక్కున్నారు.

"ముక్కులు పట్టుకుని లాక్కోండి!" - ముక్కులు ఒకరివొకరు లాక్కున్నారు.

"మగాళ్ళు చొక్కాలు పైకెత్తండి..!" అన్నాడు. - అలాగే చేశారు.

"ఆడాళ్ళు లంగాలు దులపండి..!" అన్నాడు. - దులిపారు.

"మగాళ్ళు తలపాగాలు విప్పి విసిరేయండి..!" - విసిరేశారు.

"ఆడాళ్ళు వోణీలు తీసి పారేయండి..!" - పారేశారు.

"ఒకరినొకరు ఎదురుగా గుద్దుకోండి..!" - అలాగే గుద్దుకుంటున్నారు.

"మగాళ్ళు తలగుడ్డలు తీసి చుట్టుకోండి...!" - చుట్టుకున్నారు.

"ఆడాళ్ళు వోణీలు వేసుకోండి..." - వేసుకున్నారు.

"మళ్లీ మీ అందరికీ పిచ్చెక్కింది..!" - మళ్ళీ పిచ్చిపిచ్చిగా డాన్స్ చేయసాగారు.

"కళ్ళు తిరిగాయి... పడిపోండి!" - ఒకళ్ళ మీద ఒకళ్ళు పడిపోయారు.

"అంతే... ఫినిష్! ఈ డాన్స్ ఐటమ్ రేపటి నుండి ప్రాక్టీస్ చేయండి... మిస్ సూపర్‌వైజ్ చేస్తుంది!" - పుల్ల క్లాసు ముగించాడు.

"ఎలా వుంది?" అన్నాడు నా దగ్గరికి వచ్చి.

"అద్భుతంగా వుంది!" అని పైకి అని, లోపల 'పిచ్చిపిచ్చిగా వుంది' అని అనుకున్నాను.

"ఇది ఏ సినిమా కోసంరా?" అడిగాను.

"పిచ్చిపెళ్ళాం- మంచి మొగుడు' సినిమా కోసంరా బాబూ! ఇది ఇంటర్నేషనల్ లెవెల్లో హిట్ అవుతుందిరా... తెలుసా?" అన్నాడు.

'అవును... ఆ తర్వాత జనానికి పిచ్చెక్కడం ఖాయం!' అనుకున్నాను లోలోపల. పైకిమాత్రం "నీ మేధస్సుకు జోహార్స్!" అన్నాను.

"ఇవేం చూశావ్... వచ్చే సంవత్సరంలో 'మంటల్లో భార్య- సందుల్లో భర్త' సినిమా కోసం రేపు ఇంకో డాన్స్ కంపోజింగ్ వుంది. రేపు చూసి వెళ్ళువుగాని!"

"తప్పకుండా! రేపు సెక్రటేరియట్‌లో పని వుంది. అది చూసుకుని వస్తానులే!"

"సార్‌ని కారులో ఎక్కడ కావాలంటే అక్కడ దింపించు!" అని డ్రైవర్‌కి చెప్పి, "రేపు ఫోన్ చెయ్యి! కారు పంపిస్తాను" అన్నాడు నాతో.

"అలాగే..." అని బయటపడ్డాను.

మర్నాడు 'మంటల్లో భార్య- సందుల్లో భర్త' డ్యాన్స్ కంపోజింగ్ చూడడానికి నాకు ధైర్యం చాలలేదు. ఎందుకంటే... వాళ్ళతో పాటుగా నేను కూడా 'అసంకల్పిత ప్రతీకార చర్య'గా పిచ్చోడిలా ఎగురుతానేమోనని భయం వేసింది.

మర్నాడు ఉదయం పేపర్లో- రాజధానిలోని ఓ సాంస్కృతిక సంస్థ ద్వారా మా 'ఆర్.కె.కె. పుల్ల'గారికి 'అభినవ నాట్యరాజు' బిరుద ప్రదానం' అని చదివాను.

అవును మా 'పుల్ల'గాడు బిరుదుకు నూరుశాతం అర్హుడు. అలనాటి నాట్య సంప్రదాయాలను పాతిపెట్టిన వాళ్ళను 'అభినవ నాట్యరాజు' అంటేనే సముచితంగా వుంటుంది.

ఎదురుగా పోస్టర్ అంటిస్తున్నారు గోడ మీద... 'పిచ్చిపెళ్ళాం- మంచి మొగుడు.' ఆ పోస్టర్‌లో ఆడాళ్ళు, మగాళ్ళు జుట్లు పీక్కునే సన్నివేశం వుంది. జనం చాలామంది చూస్తున్నారు ఆ పోస్టర్‌ని.

'విష్ యూ ఆల్ ది బెస్ట్... మైడియర్ ఫ్రెండ్ పుల్లారావ్!' అనుకున్నాను.

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 24 ఏప్రిల్ 1997 సంచికలో ప్రచురితం